# అనుబంధం

# CREATIVE VIBES

## S.V.U. COLLEGE OF ARTS

TIRUPATI





# MAGAZINE

## 2012 - 2013



# కుటుంబరావు కథల్లో సామాజిక దృక్పథం

- సి.యస్. క్షేత్రపాల్‌రెడ్డి
తెలుగుపరిశోధక విద్యార్థి
యస్.వి. యూనివర్శిటీ, తిరుపతి.

సమాజాన్ని అర్థం చేసుకోకపోతే ఎంతటివారికైనా సాహిత్యాన్ని అర్థంచేసుకోవడం దుర్లభమవుతుంది. సాహిత్యం అసలైన సామాజికతకు ప్రతిరూపం. అందుకే అది వింతల్ని చూపిస్తూ నవ్విస్తుంది. విశేషాల్ని చూపిస్తూ కవ్విస్తుంది. విషమ సమస్యల్ని చూపిస్తూ భయపెడుతుంది.

ఎప్పటి సాహిత్యంలో అప్పటి సమాజం దర్శనమిస్తుంది. ఆనాటి ప్రజల సామాజిక జీవితానికి ఆసాహిత్యం ప్రతిబింబంగా వుంటుంది. రచయిత తన జీవితంలో ఎదుర్కొన్న ప్రతి సంఘటననూ, అనుభవాన్ని తద్వారా తాను పొందిన ప్రతి మనోభావాన్ని తక్కిన సామాజికులతో పంచుకోవాలన్న ఆవేదన, తపన ప్రతి రచయితకు వుండాలి. అప్పుడే అతని అనుభవాలు సాహిత్యరూపంలో సమాజంలోని తక్కిన వారందరికీ అనుభవమవుతుంది. కథలో ఒక నీతి వున్నంత మాత్రాన అందులో సామాజిక పరిణామం ప్రతిఫలించదు. జీవితాన్ని గురించిన సూత్రాలు చాలా తెలుసుకోవాలి. తన నిజ జీవిత అనుభవాన్ని ఆసూత్రాలకు అన్వయించుకుంటూ సామాజిక సత్యాల్ని తరచి నిరూపించిన ఆధునిక రచయిత కొడవటిగంటి కుటుంబరావు.

ప్రజా జీవితంలోని అనేక అంశాల సమాహారమే సమాజం. సమాజాన్ని విడిచి సాహిత్యం జీవించలేదు. సమాజం సజీవమైంది. సామాజిక స్పృహ కల్గిన కొడవటి గంటి కుటుంబరావు సమాజంలో వచ్చిన పరిణామాలను తన సాహిత్యంలో ప్రతిఫలింపచేశాడు. మానవుని సామాజిక జీవన చిత్రణ ఈయన కథలకి ప్రాణం. సమకాలీన సమాజంలోని భావ సంచలనాలు కుటుంబరావు రచనల్లో వెల్లడించాడు. కథల్లో సామాజిక సమస్యల మూలాలను వాటి పరిష్కార మార్గాలను ఆవిష్కరించారు. ప్రతి కథలోనూ సామాజిక మానవీయ సంబంధాలు పాఠకులకు కనిపిస్తాయి.

చారిత్రక పరిణామ క్రమంలో భాగంగా జరిగిన పారిశ్రామికీకరణనూ, పట్టణ ప్రాంతాల అభివృద్ధినీ బూర్జువా నాగరికతనూ ఈయన కథల్లో చూడవచ్చు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారి మానవ నైతికత, విలువల మనుగడే...... ప్రశ్నార్థకంగా, ప్రమాద భరితంగా మారుతున్న దశ కన్పిస్తుంది. ప్రపంచీకరణ, గ్లోబలైజేషన్‌ల తర్వాతి నూతన జీవిత పరిణామాల్ని సామాజిక ఆర్థిక కోణాల్ని గమనించవచ్చు. నీతి నియమాల్ని మరచిన యువతరాన్ని దారితప్పుతున్న భూస్వామ్య, ధనస్వామ్య వ్యవస్థల్ని గమనించవచ్చు. అస్తవ్యస్తంగా కనిపించే జీవితపు కోరల్లో చిక్కుకున్న నిర్భాగ్యుల జీవిత పతనాన్ని చూడవచ్చు.

కొడవటి గంటి కుటుంబరావు సమకాలీన సామాజిక జీవిత అవగాహనకు గల నేపథ్యం

కొడవటి గంటి కుటుంబరావు పుట్టిపెరిగిన కాలం ఇటు తెలుగు సమాజం అటు యావద్భారతం గొప్ప మార్పులకు లోనవుతున్న కాలం. 1914లో ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధం ఆదినుండీ చివరిదాకా పూర్తిగా సామ్రాజ్యవాద నేపథ్యంలో జరిగిన యుద్ధమే. ఇటు మన దేశంలో కూడా పరాయి పాలనకు వ్యతిరేఖంగా తీవ్రమైన పోరాటం సాగుతున్న దశ. మన దేశంపై బ్రిటీష్ పాలకుల ఆదిపత్యం మన కాంగ్రెసు నాయకులను స్వాతంత్ర సమరంలోకి దింపింది. గాంధీజీ నాయకత్వంలో జాతీయోద్యమం, శాసనొల్లంఘన ఉద్యమాలు దేశమంతటా విస్తృతంగా వ్యాపిచాయి. ఈకాలాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుని భూస్వాములు, వడ్డీవ్యాపారులు పెట్టుబడిదారులు ఆర్థికంగా బలిసి సమాన్య రైతాంగం చిక్కిపోయింది. దొంగవ్యాపారాల ప్రభావంతో ధరల పెరుగుదల దీని మూలంగా రైతులు కూలీలుగా మారి తర్వాత పట్టణాలకు చేరి పారిశ్రామిక కూలీలుగా, కార్మికులుగా మారడాన్ని తన నిజజీవితపు అనుభవాలనుండి కథల రూపంలో సమాజానికి అందించారు.

మార్క్సిజం వెలుగులో సామాజిక విశ్లేషణతో ప్రజల జీవితపు సమస్యల్ని గుర్తించి విడమర్చి చెప్పి సమాజాన్ని చైతన్యవంతంగా మార్చకపోతే సమాజపు స్వరూపాన్ని మార్చడం అసాధ్యమని దృఢంగా నమ్మిన రచయిత కొడవటిగంటి కుటుంబరావు. భూస్వామ్య, బూర్జువా వర్గ నీతి నియమాలతో కుటుంబ సంబంధాలు సామాజిక సంబంధాలన్నీ కేవలం వ్యాపార సంబంధాలుగా మారుతున్న తరుణం ఆనాటిది.

సామాజిక జీవితానికి మూలకేంద్రం కుటుంబ వ్యవస్థ సామాజిక పరిణామ క్రమంలో కుటుంబ వ్యవస్థ ఎన్నో ఆటుపోట్లకు, ఒడుదుడుకులకు లోనయింది. సమాజంలో వస్తున్న ఆధునికత, మార్పులు మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలను పెను మార్పులకు గురి చేస్తున్నట్టుగానే కుటుంబ వ్యవస్థను కూడా మార్పులతో కుదిపేస్తున్నాయి. దాని ఫలితంగా కుటుంబ వ్యవస్థలోని సమైఖ్యత, సమిష్టి దృక్పథాలు తలక్రిందులైనాయి. కుటుంబవ్యవస్థలో అంతకుముందు బలంగావున్న మానవీయ విలువలు క్రమంగా క్షీణిస్తూ ఆర్థిక విలువల ధుష్ప్రభావం సమాజ జీవనంపై పడింది. తద్వారా రక్త సంబంధాలు కూడా కేవలం ఆర్థిక సంబంధాలుగానే మిగిలి నైతిక విలువలు ఆర్థిక విలువలముందు తలొంచాయి.

సమాజ జీవనంలో ఉమ్మడి శ్రేయస్సు కాస్త వ్యక్తి శ్రేయస్సుగా ప్రాధాన్యతను పొందింది. ఈ విధమైన సంబంధాలు, సమాజంలో వస్తున్న మార్పుల్ని మానవ సంబంధాలలోని ఆర్థిక విలువల శక్తిని కుటుంబరావు కథలో చూడవచ్చు. కుటుంబరావు వాస్తవ జీవితంలో తాను నిలదొక్కుకోవడానికి అనేక వృత్తుల్ని చేపట్టిన మధ్య తరగతి వ్యక్తి. చాలీచాలని సంపాదనలతో అనేక ఆర్థిక ఒడిదుడుకుల్ని ఎదుర్కొన్న రచయిత. ఆ ప్రభావంవల్ల ఆయన మధ్యతరగతి ఆలోచనల్ని, పేదల రీతి బాధల్ని, ధనికుల విలాసాల్ని, తన అంతర్మధనంలో బాగా అధ్యయనం చేశారు. కారల్‌మార్క్స్ వ్రాసిన "కాపిటల్" పుస్తకం ఆయన ఆలోచనల్ని ఎంతో ప్రభావితం చేసింది. ఆ చైతన్యవంతమైన ఆలోచనాదృష్టితో తన చుట్టువున్న సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సామాజిక మార్పుల్ని లోతుగా పరిశీలిస్తూ అక్షర రూపం ఇచ్చారు. సమాజ అభివృద్ధిని కాటేయబోతున్న వ్యాపార విషసంస్కృతిని పెట్టుబడిదారి వర్గ తత్వాన్ని బట్టబయలు చేశారు.

సామాజిక జీవితంలో సాధారణంగానే వ్యక్తికీ వ్యక్తికీ మధ్య అనేక రకాల సంబంధాలుంటాయి. వీటినే మానవ సంబంధాలు అనవచ్చు. జీవితంలో మానవుని అవసరాలు ఎప్పుడూ నిలకడగా వుండవు. ఫలితంగా మానవాచరణ కూడా నిలకడగా వుండదు. దాని పర్యవసానంగా మానవ సంబంధాల్లోకూడా చలనం ఏర్పడుతుంది. ఒక వ్యవస్థను ఆర్థిక, సామాజిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక పార్శ్వాలున్నట్లే మానవ సంబంధాలకు ఆయా పార్శ్వాలుంటాయి. మానవ ఆచరణ ద్వారా ఏర్పడ్డమానవ సంబంధాలు మానవాచరణలోనే వ్యక్తమవుతాయి.

వలస పాలకుల పరిపాలనతో భారతదేశంలో అన్నిరంగాల్లో విశేషమైన మార్పులు మొదలైనాయి. అన్నిరకాల సమాజాల్ని ఆమార్పులు ప్రభావితం చేశాయి. వలస పాలన విముక్తి జరిగినా వాని ప్రతి రూపాలైన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, మార్కెట్ ఎకానమీల ఫలితాలైన అవకాశవాదం, వస్తుసంస్కృతి, ధనాధిపత్యాలు సమాజంలో బలమైన పునాదుల్ని వేసుకున్నాయి. వీటన్నింటినీ తన కథల్లో ఎక్సరే తీసి పాఠకులకందించిన అభ్యుదయవాది కొడవటిగంటి కుటుంబరావు.

సమాజంలో జరుగుతున్న రక్త సంబంధాల విధ్వంసం, దిగజారుతున్న విలువలు, బూటకపు ప్రేమలు, ప్రేమముసుగులో కామ కోరికలు, స్వార్థపూరిత రాజకీయాలు, అక్రమసంబంధాలు మూఢనమ్మకాలు, హక్కుల్ని కాలరాసేపాలన, బాధ్యతల్ని విస్మరించిన హక్కుల సాధన లాంటి వివిధ అంశాల్ని తన అనుభవాల్లోనుంచి కథల ద్వారా సమాజంలోకి చేర్చిన రచయిత కుటుంబరావు.

విద్య ప్రధాన ఆశయం జ్ఞానం. అయితే ఆ జ్ఞానంతో సంబంధంలేకుండా కేవలం సమాచారాన్ని బుర్రల్లోకి కూర్చేవిద్య, పొట్టకూటికి పనికిరాని చదువుల్లోని డొల్లతనాన్ని కుటుంబరావు సమాజానికి ఎత్తి చూపించారు. సమాజంలో పెరుగుతున్నయంత్రారాధన ఆర్భాటాలు, విలాసాలు, నిరంతర ఉద్రేక పూరిత వాతావరణం ఒకవైపు సాగుతున్నాయి. ఒకవైపు అణగారిన అట్టడుగు వర్గాల ఆక్రందనలు ఆవేశంతో శరవేగంగా మార్పును కోరుకుంటూ దూసుకొస్తున్నాయి.

ఇంకొకవైపు కాలం చెల్లిన అనాగరిక ఆచార వ్యవహారాలు, మూఢ నమ్మకాలు, రుగ్మతలు ఛాందసవాద వ్యవహారాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి భిన్న కోణాల్ని కొడవటిగంటి కుటుంబరావు కథల్లో చూడవచ్చు. వాస్తవంగా ఆలోచిస్తే కేవలం ఇది ఆనాటి సమాజస్థితి మాత్రమేకాదు. నేటి భారతీయ ముఖచిత్రం కూడా అదే. ఈ దశలోనే మానవ సంబంధాలు, సమాజపు - నడకలు సాగుతున్నాయి. సహృదయతను, సౌజన్యాన్ని సౌభ్రాతృత్వాన్ని కోల్పోతున్న నేటి భారతీయ సమాజ మానవ సంబంధాలు మార్పు పేరుతో కోల్పోతున్న దేమిటో, సమాజం మార్పును కోరుకుని వెళు తున్న దిశలో తిరోగమనం ఎలా చెందుతున్నదో కొడవటిగంటి కుటుంబరావు ఈ కథల్లో వెల్లడించాడు.

ఈ విధంగా రచన చేయడం అంత సులువైన పనికాదు. దానికి తనచుట్టూ కనిపించే సమాజాన్ని అర్థంచేసు కోగల్గిన విజ్ఞత ఉండాలి. సమాజాన్ని ప్రేమించగలిగిన హృదయం వుండాలి. సమాజంపట్ల గల అవగాహన నేపథ్యమే కుటుంబరావును గొప్ప రచనా ప్రపంచాన్ని సృజియించడానికి కారణంగా చెప్పవచ్చు.

# కొడవటిగంటి సాహిత్యం - సామాజిక న్యాయం

విశాలాంధ్ర - సాహితి (మెయిన్) Date 4-3-2013



మార్క్సిజం, మానవత ఆయన మతం. హేతువాదం ఆయనకు మంచినీళ్ల ప్రాయం. సామాజిక న్యాయ సాధనే ఆయన రచనల గమనం, గమ్యం. ఆయనే గొప్ప కథకుడు, విమర్శకుడు, ఎందరికో మార్గదర్శకుడు కొడవటిగంటి కుటుంబరావు. సమాజం, సాహిత్యం, ఆ రెండింటి మధ్య ఉండాల్సిన సంబంధాలపై నిర్దిష్ట, నిర్దుష్ట భావనలు, అంతకుమించిన నిబద్ధత ఉన్న రచయితాయన.

'సమాజాన్ని, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి కేవలం అనుభవమే చాలదు. కొన్ని సాంఘిక సిద్ధాంతాలు అవసరం. అవి లేకుండా సమాజం, కళలు, సాహిత్యం అభివృద్ధి అవుతాయన్నది కేవలం భ్రమ' అని కొడవటిగంటి పేర్కొన్నారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయం విద్యార్థిగా వామపక్ష భావాలు కలిగిన మిత్రులు, ఉపకులపతి మదన్‌మోహన్ మాలవ్యా వంటి అభ్యుదయ వాదుల ఉపన్యాసాలతో ఆయన ప్రభావితులయ్యారు. కారల్ మార్క్స్ 'క్యాపిటల్' చదవడం వల్ల ఆయనకు 'జీవితంలోని, సమాజంలోని కుళ్లు చాలా వరకు అర్థమైంది'. మార్క్సిజం వెలుగులో సామాజిక చెడుగుల్ని గుర్తించారు. ప్రజా చైతన్యానికి తన రచనల్ని ఆయుధాలుగా మలిచారు. సమాజంలో పెచ్చరిల్లిపోతున్న వస్తు, వ్యాపార సంస్కృతులు, బూర్జువా వర్గపు నీతి నియమాలను తూర్పారబట్టారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేసిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల చెడు ప్రభావాల ఫలితాన్ని ఆయన ఆనాడే గ్రహించారు. అవి సామాజిక న్యాయానికి విఘాతంగా మారుతాయని తన రచనల్లో హెచ్చరించారు. సామాజిక అసమానతలు మరింతగా పెరిగి, విలువలు క్షీణ దశకు చేరకముందే ప్రజా సమూహాలు మేల్కొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో సమస్త అన్యాయాలకు ప్రధాన కారణం ఆర్థిక, విద్యా అసమానతలు, స్త్రీ వివక్ష, కుల, మత, రాజకీయాలేనని, వాటిని సరిదిద్దినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన స్పష్టంచేశారు.

సమాజంలోని పేద, ధనిక వర్గాల మధ్య అత్యధిక సంఖ్యలో ఉన్న మధ్యతరగతి ప్రజలు నిస్సహాయత, నిరుత్సాహం, న్యూనతాభావాలను ఆయన గుర్తించారు. భూస్వామ్య సామాజిక విలువలను ప్రతిఘటిస్తూ కలాన్ని కత్తిలాగా ఉపయోగించారు. ధనస్వామ్య, పెట్టుబడిదారీ వర్గపు ఆర్థిక దోపిడీని చిత్రించారు. సమాజాన్ని పడగవిప్పి కాటేయాలనుకుంటున్న విషపూరితమైన వ్యాపార సంస్కృతిని, అనారోగ్యకర ఆర్థికపు మూలాలను బట్టబయలు చేశారు. 'నిష్కామ కర్మ', 'శ్రీ కృష్ణ పరబ్రహ్మణేనమః', 'పైకి వచ్చినవాడు', 'పెళ్లి చేయకుండా చూడు' కథల్లో లంచగొండితనాన్ని ఎండగట్టారు. ఆర్థిక అసమానతలను ఎత్తిచూపారు.

'చెల్లని రూపాయి', 'ఆర్థికోపన్యాసాలు' లాంటి కథల్లో-ఆర్థిక అసమానతలు అక్రమ సంపాదనలు, దారిద్ర్యం ఒక విషవలయంగా ఎలా మారిందో వర్ణించారు. వ్యాపార సంస్కృతి విస్తరించడంతో ప్రజల విశ్వాసాలు, నమ్మకాలు, భక్తిభావనను కూడా సొమ్ము చేసుకొనే తత్వాన్ని పలు కథల్లో ఆయన బట్టబయలు చేశాడు. 'విచిత్ర వివాహం' కథలో స్త్రీలకు ఆస్తి హక్కు అవసరాన్ని సూచించాడు.

'రామారావు ప్రణయ కథ'లో 'మేము ప్రదర్శించిన ఏడెనిమిది ప్రదర్శనలకుగాను చౌదరి నాలుగువేల పైచిల్లర సంపాదించాడు. మా మెంబర్లలో ఎవరికీ యాత్రై అర్వైకి పైగా దక్కలేదు. లాభం యావత్తూ ఆ చౌదరికే ఎందుకు పోవాలి?' అనే ప్రశ్న ముందుకు తెస్తారు. ఆర్థిక సమానత్వమే సామాజిక న్యాయానికి కేంద్ర బిందువు అని కుటుంబరావు స్పష్టంచేశారు.

చదువు... సంపాదన కోసమే అనే భావన ఉన్న తల్లిదండ్రులను కొడవటిగంటి తప్పుపడతారు. మనిషికి డబ్బుకన్నా చదువు ప్రధానం, అని పలు కథల్లో సూచించారు. 'పెళ్లి చేయకుండా చూడు' కథలో ఆడపిల్లకు చదువు అవసరాన్ని స్పష్టం చేస్తారు. స్త్రీ విద్య పెరగాలని కొడవటిగంటి కోరుతారు. 'ఆడబ్రతుకే మధురం' అనే కథలో బాలిక పాత్ర ద్వారా 'తాతయ్య అమ్మమ్మను ఇప్పటికీ కొడతాడు. నాన్న అమ్మను కొడతాడు, అక్కయ్యని బావ కొడతాడు.. ఎంతో పాపం చేసుకొంటే గానీ ఆడవాళ్లై పుట్టరట. అందుకనే ఆడవాళ్ళని మగవాళ్ళు కొడతారు, తిడతారు. మహా పతివ్రతలు కూడా వచ్చే జన్మలో ఆ మొగుడే కావాలని కోరుకుంటారు. ఆడజన్మ వద్దని ఎందుకు కోరరో?' అని ప్రశ్నిస్తాడు. స్త్రీల పట్ల వివక్షను ఈ కథ ద్వారా నిలదీశారు. 'సైరంధ్రి' 'ఆమె జీవితాన్ని గురించి చాలా ఆలోచించాను. ప్రకృతి ఆడదానికి అన్యాయం చేసిందంటారు. అన్నిటికన్నా హెచ్చు అన్యాయం చేసినది వివాహ వ్యవస్థ. వివాహ వ్యవస్థే లేకపోతే ఆడదాని బతుకు ఇంత లేతఅరిటాకులాగా తయారు కాదు. వివాహ వ్యవస్థను అనుసరించి వచ్చిన సామాజిక పరిణామాలన్నీ ఆడదానికి స్వేచ్ఛ లేకుండా చేశాయి.' అని అంటారు. సమాజంలో స్త్రీకి ఏ విషయంలోనూ నిర్ణయాధికారం లేకుండా పురుషుడు తమ చెప్పుచేతల్లోని దాసిగా పరిగణిస్తున్నాడు. కాబట్టి స్త్రీకి అన్యాయం చేస్తున్న ఈ వివాహ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. అందులోని లోపాల్ని సరిదిద్దితేనే సమాజంలోని సగభాగమైన స్త్రీకి స్వేచ్ఛ, సమానత్వాలు అందుతాయని ఆయన భావన.

సమాజంలో వేళ్లూనుకుపోయిన కుల వివక్షను నిలదీస్తూ 'కులం లేని మనిషి' నవల రాశారు. 'కులంగాడి అంత్యక్రియలు' కథలో 'పాపం కులంగాడు చచ్చిపోయాడు. అమిత వృద్ధుడు. ఎంతోకాలం దాబు మీద కొట్టుకొచ్చాడు. తనకు జరామృతి లేదని ఎంతోమందిని జయప్రదంగా నమ్మించి తన గొయ్యిని తనే తవ్వుకున్నాడు. ఇవాళ వాడి శవం చివికి దుర్గంధం కొడుతున్నా అంత్యక్రియలు చేసే వాళ్లు లేరు' అని అంటాడు. భవిష్యత్తులో సమాజంలో కులం అనేది ఉండరాదు. అప్పుడే అందరికీ అన్ని రకాల సామాజిక న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 'సూరి సిద్ధాంతం-1', 'సూరి సిద్ధాంతం-3' కథల్లో కుల, మతాల పట్ల తన ఆగ్రహాన్ని, వ్యతిరేకతను సూటిగా వ్యక్తపరిచారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్యమూ మారాలి. పాతకాలపు పద్ధతులకు కట్టుబడి ఉండడమంటే మోసం చేయడమేనని కొడవటిగంటి చాలా నిక్కచ్చిగా చెప్పారు.

సమాజంలోని రుగ్మతలను నిలదీస్తూ సమసమాజాన్ని కాంక్షిస్తూ తన రచనలతో సామాజిక చైతన్యానికి కృషిచేసిన గొప్ప రచయిత కొడవటిగంటి.

- డాక్టర్ కె. వెంకటరమణ
- సి.ఎస్. క్షేత్రపాల్ రెడ్డి



శ్రీమతి వరూధిని, కొడవటిగంటి దంపతులు



కుమారుడు, కోడలు - కొడవటిగంటి దంపతులు




కినిమా పత్రిక - కొడవటిగంటి



మాగోఖలే - కొడవటిగంటి



తాపీ ధర్మారావు - కొడవటిగంటి తదితరులు



సాహితీ మిత్రులతో - కొడవటిగంటి